క్లుప్తంగా

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్ : బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే వారికి ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఉండాలని అన్నారు. బీసీలు తమ హక్కుల సాధనకై పోరుబాట పట్టాలన్నారు. 75ఏళ్ల స్వతంత్ర్య భారతదేశంలో బీసీలు ఇంకా వెనుక బాటుతనాన్ని అనుభవిస్తున్నారని ఆయన వాపోయారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బి.గోవిందరావు, డి.శ్రీనివాస్, నరసింహాచారి, ఆర్. వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

తాడువాయిలో ఉచిత వైద్యశిబిరం


క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మునగాల : మండల పరిధిలోని తాడువాయిలో గురువారం రేపాల ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి నివారణ నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ మాట్లాడుతూ.. 2025వ సంవత్సరం వరకు క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్యశిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ రావుల వినోద, టీబీ సూపర్‌వైజర్ నిమ్మల వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎల్ ఎస్.భార్గవి, ల్యాబ్ టెక్నీషియన్ బి.స్వాతి, ఏఎన్‌ఎంలు సుచరిత, మమత, ఆశవర్కర్లు మయూరి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీకి ఫిర్యాదు

హుజూర్‌నగర్ : బస్సులో ఓ మహిళపై చేయిచేసుకున్న జగిత్యాల రూరల్ ఎస్‌ఐ అనీల్‌ను సర్వీసు నుంచి తొలగించాలని పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం డీజీపీకి లేఖద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో ముస్లిం నాయకులు అజీజ్‌పాషా, నవాబ్‌జానీ, గౌస్‌ఖాన్, సిరాజ్, బాబా తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

నడిగూడెం : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యదర్శుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం మండల కేంద్రానికి చెందిన గంధం రాము–నాగమణి దంపతులు వివాహ వార్షికోత్సవంతో పాటు వారి కుమారుడు సుతిక్ష జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంధం సైదులు, భీమిశెట్టి వెంకన్న , గంధం నాగమణి, మేఘన, ఆశ్రమ నిర్వాహకురాలు పాల్గొన్నారు.

ప్రజలు ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి

చివ్వెంల : గ్రామాల్లో ప్రజలు పండుగలను ఐకమత్యంగా జరుపుకోవాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజుతండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్, జెడ్పీటీసీ సభ్యుడు భుక్యా సంజీవ్ నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చార్జీలు చెల్లించాలి

పెన్‌పహాడ్ : దూర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అదనపు కూలి లేదా రవాణా చార్జీలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

హద్దుల పంచాయితీ!


షేడ్ నెట్‌లతో ప్రహరీని ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు


వివాదాలకు కారణమవుతున్న ఇళ్ల మధ్య ఉన్న స్థలం

- డబుల్ బెడ్‌రూం ఇళ్లకు హద్దులు కేటాయించకపోవడంతో ఇరువురి మధ్య వివాదాలు
- హద్దులు ఏర్పాటు చేయాలని లబ్ధిదారుల డిమాండ్

చిలుకూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలకు హద్దులు నిర్ణయించకపోవడంతో లబ్ధిదారుల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటన మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో నిర్మించిన డబుల్ ఇళ్ల మధ్య జరుగుతుంది. ప్రభుత్వం ఈ గ్రామంలో 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. ఇళ్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటి వరకు ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు, ఇళ్ల మధ్య ప్రహరీలు ఏర్పాటు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు లబ్ధిదారులే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాని అక్కడ కూడా సమస్యలు వస్తున్నాయి. రెండు ఇళ్ల మధ్య ఉన్న కొంత ఖాళీ స్థలాలకు సంబంధిత అధికారులు హద్దులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇరువురు ఇళ్ల మధ్య ఉన్న స్థలాలు తమదంటే తమదని ఘర్షణ పడుతున్నారు. హద్దులు నిర్ణయించకపోవడంతో ప్రహరీలు లేకపోవడంతో ఇంట్లోకి గేదెలు, కోళ్లు, కుక్కలు నేరుగా ఇంట్లోకి వస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల మధ్య హద్దులు నిర్ణయిస్తే ప్రహరీ ఏర్పాటు చేసుకుంటామని లబ్ధిదారులు అంటున్నారు. ప్రస్తుతం ఇళ్లకు ప్రహరీల మాదిరిగా షేడ్ నెట్స్ కట్టుకుంటున్నారు.

ఇతర గ్రామాల్లో ఇదే పరిస్థితి..

మండల పరిధిలోని పోలేనిగూడెం 40, నారాయణపురం 40, బేతవోలు 60 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అధికారులు గృహ ప్రవేశాలు చేయించి నెలలు గడుస్తున్నా నేటి వరకు అక్కడ వసతులు కల్పించకపోవడంతో ఇళ్లలోకి రాలేదు. డబుల్ బెడ్ ఇళ్ల వద్ద కనీస వసతులు కల్పించలేదు. ఇళ్లు నిర్మించిన తరువాత రెండేళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన 8నెలలకు గృహ ప్రవేశాలు చేయించారు. తీరా గృహప్రవేశాలైనా కూడా కనీసం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ఎన్ని ఏళ్లు పడుతుందో అని, అధికారులు స్పందించి ఇళ్లమధ్య ప్రహరీలు ఏర్పాటు చేయించి మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.

త్వరలో హద్దులు ఏర్పాటు చేస్తాం



ఆర్లెగూడెం, నారాయణపురం, పోలేనిగూడెం, బేతవోలు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు సుమారుగా రూ.2కోట్ల ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేస్తాము. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలకు త్వరలోనే హద్దులు నిర్ణయిస్తాము.

– లక్ష్మారెడ్డి, పీఆర్ ఏఈ, చిలుకూరు

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


బీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఇరువురు పార్టీ కార్యకర్తలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాలకు రూ.4లక్షల చెక్కులను గురువారం కోదాడలోని క్యాంపు కార్యాలయంలో మృతుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60లక్షల సైన్యం ఉన్న పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారికి బీమా సౌకర్యం కల్పించి, అనుకోని విధంగా మరణిస్తే వారి కుటుంబానికి ఆసరాగా ఉండే పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, నాయకులు కోదాటి ప్రదీప్, శ్యామ్ సుందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎలక కవిత, వీరు, మర్రి మోహన్, కాపర్తి మణికంఠకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్ రవీందర్

చిలుకూరు : గ్రామాల్లో ప్రతిఒక్కరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పులగం రవీందర్‌కుమార్ అన్నారు. గురు వారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి పద్మజ, డాక్టర్ గౌతమ్, గ్రామపెద్దలు కుర్రా అచ్చయ, గన్నా సత్యానారాయణ, పల్లా గురునాధం, దశరథ, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణలో కేంద్రం విఫలం


పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

చిలుకూరు : నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కొండాపురం, ఆర్లెగూడెం, రామాపురం గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సీపీఐ ప్రజాచైతన్య పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ మతతత్వ విధానాలతో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుందని, ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక సమస్యలను తీసుకొచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కా ర్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా, మండల నాయకులు కొండా కోటయ్య, రెమిడాల రాజు, దొడ్డా వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సాహెబ్‌అలీ, కోటయ్య, నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


కూడలి నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలు, తేలిన కంకర

మోతె : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన బీటీ, మెటల్‌రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ఆ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఈ రోడ్లపై నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ఎక్కడ ఏ గుంత ఉందోనని తెలియక భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్ల పరిస్థితిపై మండల ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకొనే నాధుడే కరువయ్యారని ఆయా గ్రామాల వాహనదారులు వాపోతున్నారు.

పూర్తిగా ధ్వంసమైన రోడ్లు..

మండల కేంద్రం నుంచి బీక్యతండాకు వెళ్లే మెటల్ రోడ్డుపై కంకర తేలి వాహనదారులకు కష్టంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా ఈరోడ్డును పట్టించుకునే నాధుడే లేడు. అదేవిధంగా రావిపహాడ్ అడ్డరోడ్డు నుంచి సర్వారం వెళ్లే మెటల్‌రోడ్డు వరకు కంకరతేలి గంతలు ఏర్పడ్డాయి. కూడలి నుంచి సర్వారం, రాందాస్‌తండా, ఉర్లుగొండ గ్రామాలను కలుపుతూ వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కూడలి నుంచి రావికుంటతండాకు వెళ్లే బీటీ రోడ్డు, హుస్సేన్‌బాద్ నుంచి రావిపహాడ్ బీటీ రోడ్డులో ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. కొత్తగా మండలంలో ప్రయాణించే ప్రయాణికులు గుంతలమయమైన రోడ్లపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారు.

కొరవడిన నాణ్యతా ప్రమాణాలు..

రోడ్లు నిర్మించే క్రమంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే అతి తొందరలో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రోడ్లు నిర్మించే సమయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నిర్మించిన ఏడాదిలోనే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలేరు వాగు నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్లు కూడలి, రావికుంట తండా, నర్సింహాపురం, నేరడవాయి గ్రామాల నుంచి అను నిత్యం ప్రయాణించడం వల్ల రోడ్లు పూర్తిగా గుంతలమయమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.


రావిపహాడ్ నుంచి బుర్కచర్ల వెళ్లే రోడ్డులో తేలిన కంకర

మరమ్మతులు చేపట్టాలి



మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. హుస్సేన్‌బాద్ గ్రామం నుంచి బుర్కచర్ల, రావిపహాడ్, సర్వారం గ్రామాలకు వెళ్లాలంటే గుంతలరోడ్లతో భయాందోళనగా ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– కాంపాటి శ్రీనివాస్, సిరికొండ

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారడంతో రోడ్లను పరిశీలించి అందుకు అవసరమైన నిధులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే గుంతలరోడ్లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

– రంగారావు, పీఆర్ ఏఈ, మోతె

ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం


భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు

భానుపురి : పట్టణంలోని తహసీల్దార్ రోడ్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రెండవ రోజు వేద పండితులు ఫణి కుమారాచార్యులు ఆధ్వర్యంలో సుందర హోమం నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అష్టోత్తర శతఘటాభిషేకం (108 కలశములు)తో పాటు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరకాండ, విష్ణు సహస్రనామ, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలను సూర్యాపేట భక్తబృందంతో జరిపించారు. అనంతరం దేవాలయ ప్రధానార్చకుడు దరూరి రామానుజచార్యులు మాట్లాడారు. ఈ నెల 12న లక్ష నాగవల్లి దళార్చన, 13న లక్ష మల్లెల పుష్పార్చన, 14న ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా 108 పర్యాయాలు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు, కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు దరూరి శ్రీధరాచార్యులు, దరూరి శ్రీనాథ చార్యులు, దరూరి భాను కుమార్, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ కీసర దేవేంద్ర చార్యులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, బోనగిరి వెంకటేశ్వర్లు, వాసా నాగేశ్వరరావు, దంతాల కొండల నాయుడు, పురం నాగరాజు, పబ్బా రజని, కే.నారాయణ రావు, కొత్త శ్రీనివాస్, నాగరాజు, చిత్తలూరు శ్రీధర్, మంచాల రంగయ్య, పబ్బా రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్


మఠంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి


హుజూర్‌నగర్ : చింతలపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి


చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతికోటయ్య

మఠంపల్లి : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ 2023 క్రీడలను నిర్వహిస్తుందని ఎంపీపీ పార్వతీకొండానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల అధికారులు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీఈటీలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 15,16,17తేదీల్లో మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో పురుషులు, మహిళలకు ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభకనబర్చిన వారికి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో అవకాశం లభిస్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీడీఓ జానకి రాములు, ఎంఈఓ చత్రునాయక్, ఎంపీఓ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి

చిలుకూరు : మండల కేంద్రంలో నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కప్ టోర్నమెంట్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 100మీటర్ల పరుగుపందెం, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో మండలం నుంచి ప్రతిభకనబరిచిన టీమ్‌లను ఎంపిక చేయాలని సూచించారు. 15నుంచి 36సంవత్సరాలు లోపు వారు క్రీడలకు అర్హులని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండుయాదవ్, సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్, పీఈటీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండలంలో ఈనెల 15నుంచి 17వతేదీ వరకు నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ కె.వెంకటరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం చింతలపాలెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టోర్నమెంట్‌లో 15నుంచి 36ఏళ్ల మధ్య వయసు కలిగిన యువతీ, యువకులకు క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పోటీల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంఈఓ సైదానాయక్, ఎంపీఓ శ్రీనివాసరావు, పీఈటీ చంపాలాల్ తదితరులు ఉన్నారు.

15నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

నడిగూడెం : మండల కేంద్రంలో ఈనెల 15నుంచి 17వరకు మండల స్థాయి సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల నిర్వహణపై శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశాన్ని ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు, సంబంధిత అధికారులు, సర్పంచ్‌లు, హాజరు కావాలని ఆయన కోరారు.

‘పది’లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు సన్మానం


హుజూర్‌నగర్ : విద్యార్థినిని సన్మానిస్తున్న సభ్యులు


చిలుకూరు : విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్‌లో 991మార్కులతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన సీఎస్‌వీ వైష్ణవీదేవిని స్థానిక షిరిడీసాయి సమాజం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూ జ లు చేయించి వైష్ణవీదేవిని శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రాజమణి, సురేందర్, కమిటీ సభ్యులు అంజయ్య, నాగేశ్వరరావు, రాము, ప్రభాకర్, రామ్మోహనరావు, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

చిలుకూరు : పదోతరగతి ఫలితాల్లో మండలంలోని నారాయణపురం జెడ్పీ పాఠశాలకు చెందిన మహేందర్‌రెడ్డి 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో ఆ విద్యార్థిని గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు జానిమియా, ఎంఈఓ సలీమ్ షరీఫ్, హెచ్ఎంలు తీగెల నరేష్, మండల చిన్నా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర–సురాంభదేవి దేవాలయ నిర్మాణానికి గౌడ కులస్తులు గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర–సురాంభదేవి, వన ఎల్లమ్మ, వన మైసమ్మ దేవాలయాల నిర్మాణానికి గ్రామ గౌడలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన సద్దల సుశీల–యాదగిరిగౌడ్ 3గుంటల స్థలం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు పందిరి సైదులు, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాడిశెట్టి సైదులు, అబ్బగాని కాశయ్య, జాన్‌పాషా, కారింగుల సతీష్, పందిరి నాగయ్య, శెనగాని లక్ష్మయ్య, తండు చంద్రు, రమణయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు

- కోదాడ – ఖమ్మం రహదారి నిర్మాణంతో కోదాడ పట్టణంలో తీరనున్న ట్రాఫిక్ తిప్పలు
- అవసరమైన చోట అండర్‌పాస్‌లు, సర్వీస్‌రోడ్ల నిర్మాణం
- పట్టణంలోకి రాకుండా నేరుగా ఏపీ– హైదరాబాద్ వైపు వెళ్లనున్న వాహనాలు


దుర్గాపురం క్రాసింగ్ వద్ద హైదరాబాద్-విజయవాడ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్


పూర్తికావస్తున్న సర్వీస్ రోడ్డు


అల్వాలపురం వద్ద పూర్తయిన పనులు

కోదాడరూరల్ : కోదాడ – ఖమ్మం జాతీయ రహదారి 365ఏ విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖమ్మం నుంచి కోదాడ శివారు దుర్గాపురం జంక్షన్ జాతీయ రహదారి 65వరకు 32కిలోమీటర్ల మేర ఈ రహదారి పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం 17కిలోమీటర్ల పనులు పూర్తికాగా, మరో 15కిలోమీటర్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో అనంతగిరి మండలం శాంతినగర్ నుంచి దుర్గాపురం వరకు 8.5కిలోమీటర్లు ఈ రహదారి విస్తరించి ఉంది. బొజ్జగూడెం స్టేజీ నుంచి కోదాడ పట్టణంలోకి రాకుండా బైపాస్‌గా దుర్గాపురం వరకు 5.5 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించనుంది. ఈ రహదారి నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ వైపు విజయవాడ, గుంటూరు జిల్లాలకు వెళ్లే, హైదరాబాద్, మిర్యాలగూడెం వైపుకు వెళ్లే వాహనాలు కోదాడ పట్టణంలోకి రాకుండానే నేరుగా ఆయా ప్రాంతాల వైపు వెళ్లనున్నాయి.

బొజ్జగూడెం శివారు నుంచి బైపాస్..

అనంతగిరి మండలం బొజ్జగూడెం స్టేజీ శివారులో గల రైస్‌మిల్లు నుంచి ఈ రహదారి చీలి కోదాడ పరిధిలోని తమ్మరబండపాలెం, అల్వాలపురం శివారుల మీదగా దుర్గాపురం జంక్షన్ వరకు బైపాస్‌గా ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. వ్యవసాదారులు సంబంధిత వాహనాలతో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా శాంతినగర్ వద్ద లకారం వైపుకు, తమ్మర వద్ద గోండ్రియాల వైపుకు వెళ్లేందుకు, మరో చోట బండపాలెం వెళ్లేందుకు అండర్‌పాసింగ్‌లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట సర్వీస్‌రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. దుర్గాపురం జంక్షన్ వద్ద హైదరాబాద్ విజయవాడ రహదారిని భవిష్యత్‌లో ఆ మార్గాన్ని ఆరు లైన్‌లుగా మార్చినా ఇబ్బంది లేకుండా అందుకు అనుగుణంగా కింద నుంచి వాహనాలు వెళ్లేందుకు నాలుగు వరుసల్లో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఆపనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో ఆ పరిసర ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారి ఓ పెద్ద కూడలిగా మారనుంది.

తప్పనున్న ట్రాఫిక్ తిప్పలు..

ఈ రహదారి తమ్మరబండపాలెం, అల్వాలపురం మీదగా బైపాస్ వెళ్లడంతో కోదాడ పట్టణంలోకి వచ్చే వాహనాల సంఖ్య తగ్గనున్నాయి. దీంతో పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ఖమ్మం క్రాస్‌రోడ్ నుంచి గుడిబండ ఫ్లైఓవర్ వరకు అటు తమ్మర వరకు ఎక్కువగా ఉండే ట్రాఫిక్ తిప్పలు తప్పనున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలు ఇతర జిల్లాలకు వెళ్లే వాహనాలు కూడా ఈ బైపాస్ మీదుగా అటు విజయవాడ, గుంటూరు వైపుకు ఇటు మిర్యాలగూడెం, హైదరాబాద్ వైపుకు వెళ్లడానికి వీలుంటుంది.